

ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ అధికారులను ఆదేశించారు. నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 24 ఫిర్యాదులు వచ్చాయని ఆర్‌డిఒ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన ఆర్‌డిఒ వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ

స్తంభించిన 'సహకారం'..!

సహకార సంఘాల్లో త్రిసభ్య కమిటీలు రాజీనామా

ఏ నిర్ణయమూ తీసుకోకుండా ప్రభుత్వం కాలయాపన

లావాదేవీలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు

ఉమ్మడి జిల్లాలో 256 సహకార సంఘాల్లో పరిస్థితి అంతే

ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు సమాచారం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న సహకార సంఘాల్లో (సొసైటీలు) పాలన స్తంభించిపోయింది. కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో గత ప్రభుత్వంలో సహకార సంఘాలకు నియమించిన త్రిసభ్య కమిటీల సభ్యుల నుంచి రాజీనామాలు తీసుకోవాలని ఆదేశాలు జారీఅయ్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 256 సంఘాలు ఉన్నాయి. ప్రతి సంఘంలోనూ దాదాపు వెయ్యి మంది వరకూ రైతులు ఉన్నారు. ప్రతి సంఘానికీ ఛైర్మన్, ఇద్దరు సభ్యులుగా త్రిసభ్య కమిటీలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు దాదాపు అన్ని సహకార సంఘాల్లోని సభ్యుల నుంచి అధికారులు రాజీనామాలు తీసుకున్నారు. నిబంధనల ప్రకారం ఈ కమిటీలకు జులై 30 వరకూ గడువు ఉంది. దీంతో కొంతమంది సభ్యులు రాజీనామాలు చేసేందుకు నిరాకరిస్తున్నట్లు సైతం తెలుస్తోంది. ఈ విధంగా మొండికేసిన జాబితాలో ఏలూరు జిల్లాలో 28 మంది సభ్యులు ఉన్నట్లు తెలిసింది. వీరిని ఏవిధంగా తొలగిస్తారో వేచిచూడాలి. సభ్యుల రాజీనామాల వివరాలను సహకార సంఘాల అధికారులు ప్రభుత్వానికి పంపించారు. జూన్ ఏడో తేదీ నుంచి త్రిసభ్య కమిటీలు పని చేయడం లేదు. దాదాపు 20 రోజులుగా సహకార సంఘాలకు పాలకవర్గం అనేది లేకుండా పోయింది. సొసైటీ ఛైర్మన్, లేక అధ్యక్షుడు లేకపోతే సంఘాల లావాదేవీలకు తీవ్ర విఘాతం ఏర్పడుతుంది. అందుకే పదవీ కాలం ముగియడానికి ఒకటి, రెండు రోజుల ముందే పొడిగింపు ఉత్తర్వులు ఇవ్వడం జరుగుతోంది. 20 రోజులుగా పాలకవర్గం లేకపోవడంతో లావాదేవీలు మొత్తం ఆగిపోయాయి. రైతుల నుంచి రుణాల సొమ్ము కట్టించుకుని తిరిగి రైతులకు రుణం ఇవ్వాలంటే కార్యదర్శి, ఛైర్మన్ సంతకాలు కావాల్సి ఉండటంతో ఆగిపోయాయి. డిపాజిట్‌దారులకు చెల్లింపులు నిలిచిపోయాయి. వసూలు చేసిన సొమ్ము చెల్లింపులకు అవకాశం లేకపోవడంతో సొసైటీ వడ్డీ నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఇలా అనేక సమస్యలు సహకార సంఘాలను చుట్టుముట్టాయి. సహకార సంఘాలకు ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు ప్రచారం సాగుతున్నా ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దీంతో పరిస్థితి మరింత దిగజారుతుందని చెప్పొచ్చు. సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణ చేపట్టడంతోపాటు అప్పటి వరకూ ప్రత్యేక అధికారులను నియమించాలని అంతా కోరుతున్నారు.

నామినేటెడ్ పోస్టుల తరహాలో సహకార సంఘాల పాలకవర్గాలు

సహకార సంఘాల ఎన్నికలు జరిగి ఏళ్లు గడిచిపోయాయి. 2013 జనవరిలో అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించింది. వీటి గడువు 2018 జనవరితో ముగిసిపోయింది. అప్పటి టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా అప్పటి పాలకవర్గాలనే పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. 2019 జులై వరకూ ఏడాదిన్నరపాటు ఇవి కొనసాగాయి. వైసిపి ప్రభుత్వం వచ్చాక సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారని అంతా భావించారు. అయితే త్రిసభ్య కమిటీ పేరుతో ఒకరిని ఛైర్మన్, ఇద్దరిని సభ్యులుగా నియమించి పాలన సాగించింది. ఆరు నెలలకు ఒకసారి ఈకమిటీల పదవీకాలం పొడిగిస్తూ కాలం వెళ్లదీసింది. ఎన్నికలు మాత్రం నిర్వహించలేదు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పోస్టుల తరహాలో భర్తీ చేస్తూ రాజకీయ పోస్టుల్లా మార్చేసింది. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా సహకార వ్యవస్థ నిర్వీర్యమవుతోంది. ఎన్నికలు జరిగితే ప్రతి సంఘానికీ అధ్యక్షునితోపాటు 11 మంది సభ్యుల వరకూ ఉంటారు. ఇది సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసేదిశగా పనిచేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వాలు అటువైపు ఆలోచించికపోవడం దారుణంగా చెప్పొచ్చు.

ఒకటి, రెండు రోజుల్లో ప్రత్యేక అధికారుల నియామకం

ఆరిమిల్లి శ్రీనివాస్, సహకార సంఘాల అధికారి, ఏలూరు

జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లోని త్రిసభ్య కమిటీ సభ్యుల నుంచి రాజీనామాలను ప్రభుత్వానికి నివేదించాం. 28 మంది సభ్యుల వరకూ రాజీనామాలు ఇవ్వలేదు. వాటిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సహకార సంఘాలకు ఒకటి, రెండు రోజుల్లో ప్రత్యేక అధికారులను నియమించే అవకాశం ఉంది. అప్పటి వరకూ ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నాం.

డిఎస్‌సిపై స్పష్టత కరువు..!

తొలి సంతకాలకు మంత్రిమండలి ఆమోదం

డిసెంబర్ పదో తేదీలోపు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

టెట్ కం డిఎస్‌సినా, వేర్వేరు పరీక్షలా?

జులైలో రూ.ఏడు వేల పెన్షన్ అందజేత

అన్న క్యాంటీన్ల పునరుద్ధరణతో పలువురికి మేలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సిఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారం తర్వాత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు తొలి ఐదు సంతకాలను సోమవారం జరిగిన తొలి మంత్రిమండలి సమావేశం ఆమోద ముద్ర వేసింది. డిసెంబర్ పదో తేదీలోపు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ పూర్తి కానుంది. రెండు జిల్లాల్లో 1200 పోస్టుల వరకూ భర్తీ అయ్యే అవకాశం ఉండటంతో డిఎస్‌సి అభ్యర్థులంతా చదువులో మునిగి తేలుతున్నారు. అయితే ప్రభుత్వం డిఎస్‌సి పరీక్షలు ఏ విధంగా నిర్వహిస్తుందనే అనుమానాలు మాత్రం అందరినీ వెంటాడుతున్నాయి. మంత్రివర్గ సమావేశం తర్వాత కూడా దీనిపై స్పష్టత రాని పరిస్థితి నెలకొంది. టెట్ కం డిఎస్‌సి నిర్వహిస్తారా.. లేక టెట్ ప్రత్యేకంగా, డిఎస్‌సి పరీక్ష ప్రత్యేకంగా నిర్వహిస్తారా అనేది తేలాల్సి ఉంది. నిబంధనల ప్రకారం అయితే ఇప్పటికే టెట్ నిర్వహించాల్సి ఉంది. ఎన్నికల ముందు టెట్ నిర్వహించిన ఫలితాలు ప్రకటించలేదు. ఒకసారి టెట్ రాసి క్వాలిఫై అయితే ఆ అభ్యర్థి డిఎస్‌సి పరీక్ష రాసేసినంత కాలం ఉపయోగపడుతుంది. టెట్ పరీక్ష 150 మార్కులకు నిర్వహిస్తున్నారు. టెట్‌లో వచ్చిన మార్కులను డిఎస్‌సిలో 20 శాతం మార్కులుగా కలుపుతారు. ఇప్పుడు టెట్ కం డిఎస్‌సి నిర్వహిస్తే వంద మార్కులకు పరీక్ష పేపర్ ఉంటే 80 మార్కులకు డిఎస్‌సి, 20 మార్కులకు టెట్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. దీనివల్ల అభ్యర్థులకు నష్టం తప్ప లాభం లేదనే చర్చ నడుస్తోంది. ఇప్పటికే టెట్ రాసిన వారు ఇప్పుడు కావాలనుకుంటే రాస్తారు, లేకపోతే వదిలేస్తారు. డిఎస్‌సి పరీక్షకు పూర్తిగా సన్నద్ధమవుతారు. టెట్ కం డిఎస్‌సి నిర్వహిస్తే రెండు పరీక్షల సిలబస్ చదవాల్సి ఉంటుంది. అప్పుడు అభ్యర్థులపై ఒత్తిడి పెరుగుతుంది. ఇప్పటికే అభ్యర్థులంతా కోచింగ్ సెంటర్లలో సొమ్ము చెల్లించి డిఎస్‌సికి సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం డిఎస్‌సి, టెట్ పరీక్షలపై స్పష్టత ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.

జులైలో రూ.ఏడు వేలు పెన్షన్

కొత్త ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న రూ.మూడు వేల పెన్షన్‌ను రూ.నాలుగు వేలకు పెంచుతూ మంత్రిమండలి సమావేశం ఆమోద ముద్రవేసింది. అంతేకాకుండా పెంచిన పెన్షన్‌కు సంబంధించిన ఏప్రిల్, మే, జూన్ నెల ఎరియర్స్ సొమ్ము మూడు వేలు సైతం చెల్లించనుంది. దీంతో ప్రతినెలా ఇచ్చే రూ.నాలుగు వేల పెన్షన్‌తోపాటు ఎరియర్స్ కింద రూ.మూడు వేలు మొత్తం జులైలో రూ.ఏడు వేలు సొమ్ము పింఛన్ లబ్ధిదారులకు అందనుంది. దీంతో రెండు జిల్లాల్లో 6.02 లక్షల మంది పెన్షన్‌దారులకు లబ్ధి చేకూరనుంది. ఇక నుంచి ఇంటికి సచివాలయ ఉద్యోగులే పెన్షన్ అందించనున్నారు. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణతో పట్టణాల్లో నిరుపేదలకు ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది.



నరసాపురం : కౌలురైతుల సంఘం, రైతుసంఘం ఆధ్వర్యాన ధర్నా



పోడూరు : తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు



వీరవాసరం : ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

26న 'కార్మికవర్గం-సవాళ్లు' అంశంపై సెమినార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు పర్స సత్యనారాయణ శతజయంతి సందర్భంగా కార్మికవర్గం-ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై ఈ నెల 26న సెమినార్ నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ తెలిపారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధా.. సంక్షేమమా అనే అంశంపై నేడు చర్చ విస్తృతంగా సాగుతోందని గుర్తు చేశారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని సమపాళ్లలో అందించేలా దేశ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతూ పాలన సాగాలని కోరుతూ సెమినార్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సెమినార్‌లో కృష్ణ, గుంటూరు పట్టభద్రుల ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. జిల్లాలోని ఉద్యోగులు, కార్మికులు అంతా పెద్దఎత్తున ఈ సెమినార్లో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

రావాల్సిన ధాన్యం బకాయిలు రూ.800 కోట్లు

ఇబ్బందుల్లో పేద, మధ్యతరగతి, కౌలు రైతులు

వడ్డీతో సహా ధాన్యం బకాయిలు చెల్లించాలి

సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం

ధాన్యం సొమ్ము వెంటనే చెల్లించాలని ఆందోళన

ప్రజాశక్తి - పాలకోడేరు

జిల్లాలో రూ.800 వందల కోట్లకుపైగా ధాన్యం బకాయిలు పేరుకుపోయాయని, దీంతో పేద, మధ్యతరగతి, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం విక్రయించి నెలలు గడుస్తున్నా సొమ్ము రాకపోవడంతో పెట్టుబడుల అప్పులకు వడ్డీ పెరిగి రైతులు ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నారని, వడ్డీతో సహా ధాన్యం బకాయిల సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. పాలకోడేరు మండలం విస్సాకోడేరులోని గ్రామ సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం మద్దతు పలికింది. ఈ సందర్భంగా బలరాం మాట్లాడారు. నెలలు తరబడి రైతులకు బకాయిలు చెల్లించకపోవడంతో రైతులు ప్రధానంగా పేద, మధ్యతరగతి, కౌలురైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సార్వా సాగుకు పెట్టుబడుల కోసం రైతులు ఏం చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారన్నారు. ప్రజలు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, కరెంటు ఛార్జీలు ఆలస్యమైతే వడ్డీతో సహా ముక్కుపిండి వసూలు చేస్తున్నారని, రైతులకు చెల్లించాల్సిన బకాయిలకు మాత్రం అతీగతీ లేదని విమర్శించారు. జిల్లాలో ఇప్పటికీ రూ.800 కోట్లకుపైగా బకాయిలున్నట్లు తెలుస్తోందన్నారు. నారుమడులకు, విత్తనాలు, ఎరువులు, ఇతర ఖర్చులకు రైతులు ధాన్యం సొమ్ము కోసం ఎదురు చూడాల్సి రావడం బాధాకరమన్నారు. రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వడ్డీతో సహా తక్షణం చెల్లించాలని బలరాం డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం మద్దతు ధర పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని కోరారు. కేంద్రం ఇటీవల క్వింటాల్ ధాన్యానికి మద్దతు ధర కేవలం రూ.117 మాత్రమే పెంచడం సిగ్గుచేటని విమర్శించారు. క్వింటాల్ ధాన్యం ఉత్పత్తికి సుమారుగా రూ.3 వేలకుపైగా ఖర్చవుతోందని, కేంద్రం ప్రకటించిన ధర రూ.2300 మాత్రమే ఉందని అన్నారు. స్వామినాధన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం కలిపితే క్వింటాలు ధాన్యం మద్దతు ధర రూ.3 వేలకుపైగా ఉండేలా కేంద్రం చర్యలు తీసుకుని వరి రైతును ఆదుకుని ఆహార భద్రతను కాపాడాలని బలరాం కోరారు. కేంద్రం ఉత్పత్తి ఖర్చును తగ్గించి చూపించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు ఇస్తున్నట్లుగా ధాన్యానికి బోనస్‌గా క్వింటాకు రూ.500 ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కలిదిండి గోపాలరాజు, కలిదిండి బంగార్రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శేషపు అప్రియ్య, కౌలురైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

వీరవాసరం: రైతులు ధాన్యం విక్రయించి రెండు నెలలవుతున్నా ఇప్పటి వరకూ సొమ్ము చెల్లించకపోవడం దుర్మార్గమని సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి విమర్శించారు. రైతులకు ధాన్యం సొమ్ము వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరసింహామూర్తి మాట్లాడుతూ పంటలు పండించేది కౌలు, పేద, సన్న, చిన్నకారు రైతులేనని అన్నారు. అధిక వడ్డీలకు అప్పు తెచ్చి పంట పండించి ప్రభుత్వం చేతిలో పెడితే డబ్బు ఇవ్వకుం డా వైసిపి ప్రభుత్వం రైతులను ఇబ్బందుల పాల్జేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పది రోజులు కావొస్తున్నా పెట్టుబడులకు చేతిలో సొమ్ము లేక నారుమళ్లు వేసే పరిస్థితి లేక దిక్కులు చూస్తున్నారన్నారు. కొత్త ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రైతులకు రబీ ధాన్యం సొమ్ము త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం సాగునీటి కాలువలు, డ్రెయినేజీలను పట్టించుకోకపోవడం వల్ల గుర్రపుడెక్క అధికంగా ఉండటం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలమయ్యారని, గత ప్రభుత్వంతో కుమ్మక్కై రైతులను అధోగతి పాలు చేశారని, అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పోతుల మృత్యుంజయ, యాళ్లబండి నారాయణమూర్తి, లింగం సత్యనారాయణ, బాలం విజయకుమార్, కేతా జ్యోతిబసు, పాలా కోటేశ్వరరావు, ఆచంట కనకాచలం పాల్గొన్నారు.

నరసాపురం: ధాన్యం సొమ్ము వెంటనే చెల్లించాలని కోరుతూ నరసాపురం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఎపి కౌలురైతుల సంఘం, రైతుసంఘం ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ జిల్లాలో దాళ్వా ధాన్యం అమ్మి రెండు నెలలు గడుస్తుందన్నారు. సార్వా సాగుకు చేతిలో సొమ్ము లేక రైతులు నానావస్థలు పడుతున్నారన్నారు. జిల్లాలో దాదాపు 70 వేల మంది రైతులకు సుమారు వెయ్యి కోట్ల రూపాయలు వరకూ రావాల్సి ఉందన్నారు. దీనిపై నరసాపురం ఆర్‌డిఒ అంబరీష్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆర్‌డిఒ వెంటనే జిల్లా జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడారు. అనంతరం ఆర్‌డిఒ మాట్లాడుతూ వారం రోజుల్లో ధాన్యం సొమ్ము ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు, కౌలురైతుల సంఘం నాయకులు కటకంశెట్టి మాణిక్యాలరావు, కవురు శ్రీనివాసు, పిల్లి కామేశ్వరరావు, గుత్తుల శ్రీరామచంద్రుడు, జల్లి రామ్మోహన్‌రావు, కటకంశెట్టి గురవయ్యానాయుడు, దిడ్ల నరేష్, చెల్లబోయిన పాండురంగా, నెక్కంటి శ్రీనివాస్, భారతాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోడూరు: దాళ్వా ధాన్యం సొమ్ము వెంటనే చెల్లించాలని కవిటం గ్రామానికి చెందిన రైతులు సోమవారం పోడూరు తహశీల్దార్ బివివి.మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. దాళ్వా ధాన్యం అమ్మి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా ఇంకా సొమ్ము అందకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. సార్వా సాగు దమ్ములకు, నారుమడులకు పెట్టుబడులకు చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కవిటం లాకుల వద్ద ఐదు అడుగుల నీటిమట్టం ఉంటే గ్రామంలోని పంట కాలువలకు, పంటబోదెలకు నీరు పొడుస్తుందని, అయితే కవిటంలాకుల వద్ద 3.3 అడుగులు మాత్రమే నీటిమట్టం ఉండడంతో గ్రామంలోని పంట బోదెలకు నీళ రావడం లేదని రైతులు తహశీల్దార్‌కు వివరించారు. నీటిఎద్దడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని, ధాన్యం బిల్లుల సమస్యను కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహశీల్దార్ మురళీకృష్ణ రైతులకు హామీ ఇచ్చారు. రైతులు మండ వెంకటరెడ్డి, మేడపాటి రఘురామరెడ్డి, మేడపాటి కుమార్‌రెడ్డి, మేడపాటి గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం

అధికారులకు డిఆర్ఒ ఉదయభాస్కరరావు ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం టౌన్



వినతులు స్వీకరిస్తున్న డిఆర్ఒ ఉదయభాస్కరరావు

నూతన ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజా ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' కార్యక్రమంలో డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు కెఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావుతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి అందిన ఫిర్యాదులను అత్యంత జాగ్రత్తగా పరిష్కరించాలన్నారు. ఫిర్యాదును ముందుగా క్షుణ్ణంగా చదివి కచ్చితమైన పరిష్కారాన్ని వేగవంతంగా చూపాలన్నారు. ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుందని, సొంత సమస్యలా భావించినప్పుడే అది సాధ్యమని అన్నారు. ఎప్పటికప్పుడు పెండింగు లేకుండా సమస్యలను పరిష్కరించడంతోపాటు అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో ఉండాలని డిఆర్ఒ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 86 ఫిర్యాదులను ప్రజల నుండి స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల అప్పిలేటు ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సాగునీటి కాలువల ప్రక్షాళనకు చర్యలు

ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - మొగల్తూరు

సాగునీటి కాలువల ప్రక్షాళన చర్యలు చేపట్టాలని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అధికారులకు సూచించారు. సోమవారం మొగల్తూరులోని లాగు ప్రాంతంలో ఉన్న ప్రధాన కాలువను, కేపీపాలెం సౌత్, కేపీ పాలెం నార్త్, పేరుపాలెం సౌత్, పేరుపాలెం నార్త్ గ్రామాలకు వెళ్లే జంగల్ ఛానల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శివారు ప్రాంతాలకు నీరు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే ఆయా కాలువలని ప్రక్షాళన చేసి పూర్తిస్థాయిలో నీరందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట సర్పంచి బందెల ఎలీషా, మేళం బన్ను, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.




జంగిల్ చానల్‌ను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ నాయకర్

తాగునీరందించండి మహాప్రభో..

సిపిఎం ఆధ్వర్యాన సచివాలయ సిబ్బందికి వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

కోడిపందాలు దెబ్బ ప్రాంత ప్రజలకు తక్షణమే తాగునీరు అందించాలని సిపిఎం నాయకులు వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు అధికారులకు వివరించారు. 2008లో ఏర్పడిన పెనుగొండ గ్రామం కోడిపందాల దిబ్బ ప్రాంతంలో 1130 కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇచ్చారు. వీరిలో 600 మంది ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. ఈరోజు వరకు సరైన తాగునీటి సౌకర్యం లేక అనేక విధాలుగా వారు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో అప్పటి ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికల వరకు తాగునీరు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేవారు. ఎన్నికలైన తర్వాత మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ దొరకు తాగునీటి కోసం ఎన్నిసార్లు తెలిపినా నీళ్ల పంపిస్తానని అంటారే తప్ప ఈరోజు వరకు చుక్క నీరు అందజేసిన పరిస్థితి లేదని వాపోయారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో కోడిపందాలుదిబ్బ ప్రాంత ప్రజలు తక్షణం తాగునీరు సమస్య పరిష్కరించాలని, వీధి దీపాలు, రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాలు కల్పించాలని వినతి అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాదాసు నాగేశ్వరరావు, షేక్ పాదుషా, గుడాల వాణి, జక్కంశెట్టి సాయి పాల్గొన్నారు.



వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

అడుగంటిన తాగునీటి చెరువు

పూర్తిస్థాయిలో తాగునీరందించాలని గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రం మొగల్తూరులోని సమగ్ర రక్షిత మంచినీటి పథకం వద్ద ఉన్న తాగునీటి చెరువు అడుగంటింది. కాలువలకు నీటిని విడుదల చేసి సుమారు 15 రోజులు కావస్తున్నా శివారు ప్రాంతాలకు నేటికీ నీరు చేరలేదు. దీంతో అరకొరగా వస్తున్న నీటినే కాల్వాల నుంచి చెరువులకు తోడుతున్నారు. అది కూడా పూర్తిస్థాయిలో రాకపోవడంతో నిరంతరాయంగా తోడే అవకాశం లేదు. దీంతోపాటు కాలువలో నీరు కలుషితంగా ఉందని, ఆ నీటినే చెరువులోకి తోడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను మంచినీటితో నింపేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు. ఈ సమస్యను ప్రజాశక్తి పంచాయతీ కార్యదర్శి జి.గంగన్న దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి వెంటనే చర్యలు చేపడతామని తెలిపారు.



అడుగంటిన తాగునీటి చెరువు

వ్యక్తిగత సమాచారం సోషల్ మీడియాలో పెట్టొద్దు

నిపుణుల హెచ్చరిక

భీమవరం టౌన్: వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో పెట్టవద్దని, దానివల్ల దుష్పరిణామాలు ఏర్పడుతున్నాయని ప్రముఖ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ నిపుణులు హెచ్చరించారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ ఇంక్లూడింగ్ బ్లాక్ చైన్ టెక్నాలజీ) ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగే అధ్యాపక శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కెవి.కృష్ణంరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హాజరైన ప్రిన్సిపల్ అడ్వైజర్ సైబర్ సెక్యూరిటీ కమలేష్ జోషి, టెక్నికల్ అడ్వైజర్ ఎం.శ్రీనివాస్ రాజులు మాట్లాడుతూ సైబర్ నేరాలు బాగా పెరిగిపోతున్నాయని, అందువల్ల సోషల్ మీడియాలో పెట్టిన సమాచారాన్ని ఎవరైనా చౌర్యం చేసి దానిని ఏ విధంగానైనా ఉపయోగిస్తారని హెచ్చరించారు. అందువల్లే సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీస్‌పై అవగాహన ఏర్పరచుకుంటే తమ సమాచారాన్ని తామే దాసుకున్నప్పుడు ఎవరికైనా కావాలంటే దాన్ని మన వద్ద నుంచి నగదు చెల్లించి కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ ఇంజనీరింగ్‌లో అన్ని విభాగాలు సైబర్ సెక్యూరిటీ టెక్నాలజీని అధ్యయనం చేయాలని సూచించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు గత కొంతకాలం నుంచి సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జిఎన్‌వి జి.శిరీష, డాక్టర్ రవికిరణ్ ఉన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

27న జెడ్‌పి స్థాయి సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈ నెల 27వ తేదీ ఉదయం పది గంటల నుంచి ఏలూరులోని జిల్లా ప్రజా పరిషత్‌లోని ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ సిఇఒ కె.సుబ్బారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

28న ఉచిత వైద్య శిబిరం

పోడూరు: మండలంలోని న్యూ లైఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పండిత విల్లూరులోని ఐపిసి చర్చిలో ఏలూరు ఆశ్రమం ఆసుపత్రిచే ఈనెల 28వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మినిస్ట్రీస్ డైరెక్టర్, చర్చి పాస్టర్ రెవరెండ్ జి.సామ్యూల్ జాన్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు ఆశ్రం ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తారని, సాధారణ వ్యాధులతో పాటు కార్డియాలజీ, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, క్షయ, ఊపిరితిత్తులు, స్త్రీల విభాగానికి సంబంధించిన రోగులకు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని పాస్టర్ జాన్సన్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం జరుగుతుందని, గ్రామ ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



మట్టిలోడుతో వేగంగా వెళుతున్న లారీని అడ్డుకున్న గ్రామస్తులు

మట్టి లోడు లారీ అడ్డగింత

నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి – పోడూరు

మండలంలోని పెనుమదం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న మట్టి లోడు లారీలను స్థానికులు అడ్డుకున్నారు. అధికారులకు పలుమార్లు మొర పెట్టుకున్నా ఒకటి, రెండు రోజులు మాత్రమే ఆపుతున్నారని మళ్లీ ఎదేచ్ఛగా మట్టి లారీలను తిప్పుతున్నారని తెలిపారు. ఈ మట్టి లారీలను అతి వేగంగా తిప్పడం వల్ల ప్రజలు రోడ్ల మీదకు రావడానికి భయపడుతున్నారని, రోడ్లు పూర్తిగా పాడై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. లేని పక్షంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని వారు హెచ్చరిస్తున్నారు.




మున్సిపల్ స్కూల్‌కు గ్యాస్ స్టవ్, కుర్చీలు అందజేసిన దాతలు

మున్సిపల్ పాఠశాలకు గ్యాస్ స్టౌ, కుర్చీలు బహూకరణ

ప్రజాశక్తి – పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలకు సోమవారం దాతలు గ్యాస్ స్టవ్, కుర్చీలు బహూకరించారు. ఈ సందర్భంగా దాతలు గాడె సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వలె ఈ సంవత్సరం మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా రూ.4 వేలు విలువగల గ్యాస్ స్టవ్‌ను పాఠశాల హెచ్‌ఎం.రాయపూడి భవానీ ప్రసాద్‌కి అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కూర్చునేందుకు రూ.4 వేల విలువ గల కుర్చీలను మజ్జి శంకరం ఇచ్చారు. దాతలు కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకుని విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. స్కూల్‌కి ఏవిధమైన అవసరం వచ్చినా తమ వంతు సహాయం ఉంటుందని తల్లిదండ్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీ ప్రసాద్, 30వ వార్డు మాజీ కౌన్సిలర్ ధనిని సూర్య ప్రకాష్, మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు, పేరెంట్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు బాలం వెంకట రమణ

ప్రజాశక్తి – ఆచంట

ప్రజా సమస్యల పరిష్కార ధ్యేయంగా ప్రజల సమస్యలపై వినతి పత్రాలు స్వీకరిస్తున్నామని టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు బాలం వెంకట రమణ అన్నారు. ప్రజల వద్దకే నాయకులు కార్యక్రమంపై ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ పిలుపులో భాగంగా కొడమంచిలి గ్రామంలో సోమవారం టిడిపి నేతలు ప్రజా సమస్యలు తెలుసుకుని వారి వద్ద నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. గ్రామాల మార్పుకు టిడిపి నాయకులంతా కలిసికట్టుగా పనిచేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి చిలుకూరు వీర వెంకట సత్యనారాయణ మూర్తి, నేతలు కుసుమే నరసింహమూర్తి, కట్టా సుబ్బారావు, నెక్కంటి పెద్దబాబు, చిలుకూరి శ్రీను, రాపాక ఆనందరావు, మన్నే చేజ, జీవన్ కిరణ్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి – ఆచంట

ప్రజల ఫిర్యాదులు, సూచనలు తప్పకుండా పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని తహశీల్దార్ పిల్లిశెట్టి ఐ అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజల సమస్యల పరిష్కార వేదిక, మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి పథంలో నడిపించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. స్థానిక సంస్థలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.సరసింహ ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాస్, ఎఎస్ఐ ఎంఎల్‌ఓఎస్ మూర్తి రాజు, ఇఓపిఆర్‌డి మూర్తి బాబు, ఎంఇఒ ఉషారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. సాంకేతిక సమస్యతో పాలకొల్లు మండల కార్యక్రమాన్ని కూడా మున్సిపల్ కార్యాలయంలోనే నిర్వహించారు. అయితే తగిన ప్రచారం లేక కేవలం పాలమూరు సర్పంచి ఫిర్యాదు ఒక్కటి మాత్రమే వచ్చింది. మున్సిపల్ కమిషనర్ విజయ సారథి, ఎంపిడిఒ అనుపమ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యాగర్లపల్లిని అభివృద్ధి చేస్తా..

భక్తాంజనేయ వార్షికోత్సవ వేడుకలో ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

భక్తాంజనేయ స్వామి చల్లని దీవెనలు, ప్రజలందరి ప్రేమాభిమానాలతో తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఎంఎల్ఎగా గెలుపొందిన తాను నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని యాగర్లపల్లిలో విష్ణుశ్రీ భక్తాంజనేయ స్వామి 15వ వార్షికోత్సవ వేడుకల్లో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెం మున్సిపల్ చైర్మన్ చేసినప్పటి నుంచి యాగర్లపల్లితో తనకు ఎంతో అనుబంధం ఉందని, సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో యాగర్లపల్లి ఒకటని, ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదని బొలిశెట్టి హామీ ఇచ్చారు. ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించి మంచినీటి పైపులైన్లు, డ్రెయినేజీ వ్యవస్థ సమూలంగా మారుస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, స్థానిక జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలు తిరిగి ప్రారంభించాలి

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌కు వినతి అందించిన బ్రాహ్మణ సేవా పరిషత్ సభ్యులు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం పట్టణ బ్రాహ్మణ సేవా పరిషత్ తరుపున సోమవారం తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌ను జనసేన కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలు తిరిగి ప్రారంభించాలని, దేవాలయాల్లో, ట్రస్ట్ బోర్డుల్లో ప్రాముఖ్యత నివ్వాలని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షులు పుల్లాభొట్ల వెంకట సూర్యనారాయణ మూర్తి, సెక్రటరీ బుద్ధవరపు సత్య వెంకట సుబ్బారావు, కోశాధికారి ద్రోణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

స్టూడెంట్ కిట్ల పంపిణీలో అధికారులు



మొగల్తూరు: విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందజేస్తున్న ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి – మొగల్తూరు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించారని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. ఎంఎల్ఎగా ప్రమాణస్వీకారం చేసి మొట్టమొదటిసారిగా మండలంలోని మొగల్తూరులో సోమవారం ఆయన పర్యటించారు. స్థానిక పెనుమత్స రంగరాజు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన విద్యా సామాగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ చదువులో బాగా రాణించి గ్రామానికి, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ఇదే పాఠశాల నుంచి మెగాస్టార్ చిరంజీవి, రెబల్ స్టార్ కృష్ణంరాజు, మరి ఎంతోమంది శాస్త్రవేత్తలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఈ పాఠశాల నుంచి విద్యార్థులు వెళ్లాలని అన్నారు. మీరు కూడా ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా సామాగ్రిని విద్యార్థులకు అందించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, బోణం నరసింహారావు, ఎంపిటిసి సభ్యులు దూసనపూడి మహేశ్వరి దొరబాబు, ఎన్నాబత్తుల ఉషారాణి, కుక్కల సుశీల, ఎంఇఒలు పుష్పరాజ్యం, యు.సామ్యూల్ జాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధమాని రవిశంకర్ ఉన్నారు.

పాలకొల్లు రూరల్: పాలకొల్లు రూరల్ గ్రామమైన లయన్స్ నగర్ ఎంపిపి స్కూల్‌లో విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, ట్రై, బెల్టు, షూ, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కోడి విజయభాస్కర్, మండల కార్యదర్శి పాముల రజని కుమార్, గ్రామ మాజీ సర్పంచి శేషారత్నం, బిజెపి, జనసేన నాయకులు హాజరయ్యారు.

తాడేపల్లిగూడెం: ఉపాధ్యాయులకు సరైన శిక్షణ లేకుండా, అరకొర మౌలిక సదుపాయాలతో ఇంగ్లీష్ మీడియం అంటూ జగన్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశాడని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలంటే ఎంతో పోటీ ఉండేదని, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లతోపాటు ఎంఎల్ఎ సిఫారసులు అవసరం కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు వచ్చేవారని, అలాంటి పరిస్థితి నుంచి నేడు ప్రభుత్వ పాఠశాలలో చదివించాలంటే తల్లిదండ్రులు భయపడే పరిస్థితికి వచ్చారన్నారు. ఉపాధ్యాయులను యాప్లు, రిపోర్టులు అంటూ విద్యా బోధనపై దృష్టి పెట్టనీయకుండా చేయడం జగన్ అవగాహన రాహిత్యానికి నిదర్శనం అన్నారు. కూటమి పాలనలో విద్యా వ్యవస్థకు పెద్దపీట వేస్తామని, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకువెళ్తామని, దీనికి ఉపాధ్యాయుల సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ఎంఇఒ వి.హనుమ, ఎంఇఒ–2 పిఎంకె జ్యోతి పాల్గొన్నారు.

నరసాపురం: ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారం నరసాపురం పట్టణం 7వ వార్డు మున్సిపల్ గరల్స్ హై స్కూల్ విద్యార్థులకు ప్రభుత్వ విద్యా కానుకలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఎంఇఒ పుష్పరాజ్యం సభకు అధ్యక్షత వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె వెంకట రమణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వైద్యాధికారులు డి.శ్రావ్య, డాక్టర్ నిహారిక



విద్యార్థులకు మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

సాధారణ జ్వరం అని అశ్రద్ధ చేయకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డి.శ్రావ్యా, డాక్టర్ నిహారిక పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి డాక్టర్ వై.లక్ష్మణరావు ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ నిహారిక మాట్లాడుతూ చలి, జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించాలని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. సంక్రమణ వ్యాధులలో మలేరియా అతి ముఖ్యమైనదన్నారు. ఈ వ్యాధిని నియంత్రించుటలో ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వ్యాధుల వ్యాప్తి చెందకుండా ఫాగ్గింగ్ ఆపరేషన్, స్ప్రేయింగ్ ఆపరేషన్ చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.సత్యనారాయణ అధ్యక్షతన విద్యార్థులకు మలేరియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలను భాగస్వాములు చేయడం ద్వారా మలేరియ వ్యాధిని సమాజము నుంచి తరిమివేయవచ్చునని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు, లాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ప్రత్యేక ప్రణాళికతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి

తెలుగు యువత మండలాధ్యక్షుడు కోదండ రామరాజు



ప్రజాశక్తి – కాళ్ల

ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని తెలుగు యువత కాళ్ల మండలాధ్యక్షుడు మంతెన కోదండరామరాజు తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఉండి ఎంఎల్ఎగా ఎన్నికైన నాటి నుంచి ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారన్నారు. నియోజవర్గంలో ప్రధాన సమస్య అయిన పంట, మురుగు కాలువల్లో తూడు, గుర్రపు డెక్క, పూడిక తొలగింపు కోసం రఘురామకృష్ణంరాజు తన స్నేహితులతో కలిసి రూ.50 లక్షల సొంత నిధులను కేటాయించి జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రత్యేక అకౌంట్ తెరవడం గొప్ప విషయమన్నారు. వైసిపి ప్రభుత్వంలో గత ఐదేళ్లుగా పంట, మురుగు కాలువల అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. పంట, మురుగు కాలువల అభివృద్ధి పనులకు రైతులందరినీ భాగస్వాములుగా చేసి నియోజకవర్గ స్థాయిలో రూ.4 కోట్లతో పనులు చేపట్టాలనుకోవడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు పక్కా ప్రణాళికను సిద్ధం చేయడం, మరోవైపు కిడ్నీ బాధితుల కోసం డయాలసిస్ సెంటర్ ఏర్పాటు కోసం చర్యలు చేపట్టడం ఎంతో మందికి ఆదర్శనీయమన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టే ప్రతి కార్యక్రమంలో తమ కూటమి నాయకులు, ప్రజల భాగస్వామ్యం తప్పకుండా ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వ కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం నాయకులు డిమాండ్

ప్రజాశక్తి – ఆకివీడు

ప్రభుత్వ కాలనీల్లోని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ కమిటీ సమావేశం సీనియర్ నాయకుడు డోకల రవితేజ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న గోపాలన్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం పేదల ఆశలు నెరవేర్చే దిశగా పైనించాలని అన్నారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన ఎంఎల్ఎలు ప్రజల ఆర్థిక సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్లకు అనేక మందికి రాయితీ మంజూరు కాలేదన్నారు. వెంటనే రాయితీ మంజూరయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే పూర్తి మౌలిక సదుపాయాలను కల్పించాలని, అందునా మండలంలో పెద్దదైన తాళ్లకోడు కాలనీలో మరిన్ని సదుపాయాలు అవసరమన్నారు. కాలువల దుర్గంధం ఫలితంగా చెరువులకు వెళ్లే మంచినీరు దుర్వాసనతో కూడుకుంటున్నాయన్నారు. ఈ కాలుష్యాన్ని నివారించే దిశగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రానున్నది వర్షాకాలం రీత్యా ముంపు ప్రాంతాలను ముందుగా గుర్తించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మార్చురీ రూమ్ ఏర్పాటు చేసి పోస్టుమార్టం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ కమిటీ కార్యదర్శి కేతవిటి నాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బివి.వర్మ, బి.రాంబాబు, ఎస్.ఉదయ కుమారి పాల్గొన్నారు.

పూడికతీత పనులు పరిశీలన



వెంకయ్య వయ్యేరు పంట కాలువలో పూడికతీయిస్తున్న రామరాజు

ప్రజాశక్తి – కాళ్ల

రైతుల శ్రేయస్సు కోసం ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు కృషి చేయడం అభినందనీయమని రైతు మంతెన పెద్ద నరసింహరాజు అన్నారు. వెంకయ్య వయ్యేరు పంట కాలువలో జరుగుతున్న అభివృద్ధి పనులను రైతు మంతెన పెద్ద నరసింహరాజు సోమవారం పరిశీలించారు. గ్రామీణ రైతు శ్రేయస్సు కోసం రఘురామకృష్ణంరాజు పాటుపడుతున్నారని కొనియాడారు. ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు, మాజీ ఎంఎల్ఎ, టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు ఆదేశాలతో కాలవలు దగ్గర ఉండి వెంకయ్య వయ్యేరు పంట కాలువలో ప్రక్షాళన చేయిస్తున్నామన్నారు. రైతుల ప్రయోజనాలు కాపాడుతూ వారి అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు.

వైసిపి జిల్లా కార్యాలయ నిర్మాణం అడ్డగింత

ఉండి: వైసిపి జిల్లా కార్యాలయ నిర్మాణాన్ని టిడిపి ఉండి మండల కమిటీ అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కరిమెరక నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉండి మండలం ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామంలో మెయిన్ రోడ్డును ఆనుకుని కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిలో వైసిపి జిల్లా కార్యాలయ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేకుండా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారన్నారు. నిరుపేదలకు భూమి లేదని చెప్పిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సుమారు తొమ్మిది కోట్ల రూపాయలు విలువచేసే 72 సెంట్లు ప్రభుత్వ భూమిని అన్యాయంగా జిల్లా కార్యాలయ నిర్మాణానికి వినియోగించారని విమర్శించారు. అప్పుడు శంకుస్థాపనను అడ్డుకునేందుకు వెళ్తున్న ఉండి మాజీ ఎంఎల్ఎ మంతెన రామరాజును, తమను హౌస్ అరెస్ట్ చేయించి శంఖుస్థాపన చేశారన్నారు. ఇదే విషయాన్ని ప్రస్తుత ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకువెళ్లగా ఆ బిల్డింగ్ నిర్మాణాన్ని ఆపించి జిల్లా ప్రభుత్వ కార్యాలయానికి వినియోగించాల్సిందిగా ఆదేశించడం జరిగిందన్నారు. దీంతో తాము వైసిపి జిల్లా కార్యాలయ నిర్మాణాన్ని అడ్డుకొని గ్రామపంచాయతీ స్వాధీనం చేసుకునేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. సుమారు 9 కోట్ల రూపాయలు విలువచేసే స్థలంలో ప్రభుత్వ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



భీమవరం టౌన్: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి – భీమవరం టౌన్

జిల్లాలో అతిసార, డెంగీ, తదితర అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది విస్తృతంగా గ్రామాల్లో, వార్డుల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు చేతుల మీదుగా అతిసార వ్యాధి నిర్మూలన, అవగాహన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు డయేరియా నియంత్రణపై ప్రచార కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థల భాగస్వామ్యం తీసుకుని విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టి, ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించవలసిన బాధ్యత మనపై ఉందని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వర రావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, జిల్లా అభివృద్ధి అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి ఆర్.విక్టర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ డి.దేవ సుధాలక్ష్మి, జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెనుగొండ: మండలంలోని గ్రామపంచాయతీల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించాలని అధికారులకు ఎంపిడిఒ ఎస్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచులకు, అధికారులకు అత్యవసర పరిస్థితుల్లో గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, తాగునీటికి సంబంధించి క్లోరిన్ ఉండేలా చూడాలని, గ్రామాల్లోని డ్రెయినేజీలు సక్రమంగా ఉండేట్లు చేసి, చెత్తకుప్పలు, చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించేలా తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్లకు, అధికారులకు సూచించారు, వైద్యాధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాల దగ్గర అందుబాటులో ఉండాలని, పరిసరాల పరిశుభ్రత, పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అన్ని శాఖల అధికారులు, సర్పంచి పాల్గొన్నారు

కాళ్ల: సీజనల్ వ్యాధులు సోకకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తహశీల్దార్ ఎస్.శ్రీదేవి సూచించారు. సోమవారం కాళ్ల తహశీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అధికారులంతా సమన్వయంతో తాగునీటి సరఫరాకు సంబంధించి పైపులైన్లను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుని, పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలన్నారు. నిల్వ మాంసం, చేపల విక్రయాలను నిషేధించాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ మాట్లాడుతూ డయేరియా కేసులు నమోదు కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిపై ఎప్పటికప్పుడు నివేదించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ జి.స్వాతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఎఇ రమేష్ బాబు, ఎఫ్‌డిఒ ఇందిరా ప్రియదర్శిని, మండల పరిషత్ సిబ్బంది, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి – మొగల్తూరు

ఈనెల 29న నరసాపురం న్యాయస్థానంలో నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేస్తూ పారా లీగల్ వాలంటీర్లు సోమవారం మొగల్తూరులో ప్రచారం నిర్వహించారు. ఈ అదాలత్‌లో అన్ని రాజీనీతి కేసులను పరిష్కరించుకుని, నిధులు, సమయం ఆదా చేసుకోవాల్సిందిగా సూచించారు.